## క్లుప్తంగా

### హాస్టళ్ల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న రమేష్

**నల్లగొండ:** పట్టణంలోని ఎస్సీ డీడీ బాలికల ఏ,బీ,సీ,డీ హాస్టళ్లను సోమవారం నల్లగొండ మండల ఇన్‌చార్జ్ అధికారి, వెటర్నరీ జేడీ, డాక్టర్ రమేష్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టళ్లలో సౌకర్యాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంటగది, టాయ్‌లెట్స్, బాత్‌రూమ్‌లు శుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. నాణ్యతతో కూడిన భోజనం విద్యార్థులకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూఓ ఎస్.స్వప్న, సత్యవతి, దూసరి భారతమ్మ పాల్గొన్నారు.

### ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా సుందర్

**నల్లగొండ :** మర్రిగూడ మండలంలోని సరంపేట గ్రామానికి చెందిన వీసం సుందర్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా నియమితులయ్యారు. సోమవారం హైదరాబాద్‌లో సుందర్‌కు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నియామక పత్రం అందజేశారు.

### 30 నుంచి ఆలయ బ్రహ్మోత్సవాలు

**కనగల్:** కనగల్ ఎక్స్ రోడ్‌లోని శ్రీ భూనీల సమేత లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయ తృతీయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 30, 31 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆలయ బ్రహ్మోత్సవ కమిటీ సభ్యుడు, మాజీ సర్పంచ్ చిట్ల లింగయ్య గౌడ్ సోమవారం తెలిపారు. 30న పల్లకీ సేవ, 31న మహా పూర్ణాహుతి, స్వామివారి తిరుకల్యాణం జరుగుతుందన్నారు.

### ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న రైతులు

**నార్కట్‌పల్లి :** బి. వెల్లంల ప్రాజెక్టు నుంచి నార్కట్‌పల్లి పెద్ద చెరువులోకి సాగునీరు రావడంతో సోమవారం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జేరిపోతుల భరత్ ఆధ్వర్యంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం చిత్రపటానికి రైతులు, ప్రజలు పాలభిషేకం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఐతరాజు యాదయ్య, నాయకులు సట్టు సత్తయ్య, పాశం శ్రీనివాస్‌రెడ్డి, వేముల సత్తయ్య, ప్రజ్ఞాపురం సత్యనారాయణ, ఎస్‌కె.సమద్, బోడ శంకర్, అనిల్‌రెడ్డి, ఇరుకుల సంపత్, మంద శ్రవణ్, చిన్న పుల్లెంల కృష్ణ, వేముల వెంకన్న, కిరణ్, ముంత సత్తమ్మ, రాపర్తి మధు, గడ్డం సత్తయ్య, జెనిగ భిక్షం తదితరులు ఉన్నారు.

### ఆలయానికి విరాళం

**మునుగోడు:** మండల కేంద్రంలోని ముత్యాలమ్మ ఆలయాన్ని పునర్నిర్మిస్తున్నారు. కాగా ఆలయ నిర్మాణానికి మునుగోడు గ్రామ పంచాయతీ మాజీ కోఆప్షన్ సభ్యుడు పాలకూరి నర్సింహగౌడ్ సోమవారం రూ.లక్ష విరాళం అందజేశారు.

### మొక్కలు నాటిన అధికారులు

**నకిరేకల్ :** మండలంలోని తాటికల్ గ్రామ శివారులో ఎక్సైజ్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం కర్జూర మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ మల్లయ్య, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఏపీఓ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

### నూతన కమిటీ ఎన్నిక

**నల్లగొండ :** క్రెడై ద్వారా సామాజిక కార్యక్రమాలు చేస్తున్నట్లు రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ, జిల్లా ఛాంబర్ చైర్మన్ బండారు ప్రసాద్ అన్నారు. సోమవారం కన్ఫడరేషన్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(క్రెడై) జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ క్రెడై జిల్లా భవన నిర్మాణానికి కృషి చేస్తానని అన్నారు. అనంతరం క్రెడై నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా చైర్మన్‌గా బండారు ప్రసాద్, అధ్యక్షుడిగా బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఎలక్టెడ్ ప్రెసిడెంట్‌గా ఆమంచి రాజలింగం, జనరల్ సెక్రటరీగా నాంపల్లి మనోహర్, కోశాధికారిగా దూదిపాల వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ఎదుర్ల శ్రీధర్‌రెడ్డి, సముద్రాల శ్రీనివాసరావు, ఆవుల శ్రీను, మందడి వెంకట్‌రెడ్డి, జాయింట్ సెక్రెటరీలుగా గుండబోయిన వెంకన్న, బొడ్డుపల్లి సతీష్, పథ్వీరాజ్, రామారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వంగాల అనిల్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

### విశ్వబ్రాహ్మణులు రాణించాలి

**నల్లగొండ టౌన్:** విశ్వబ్రాహ్మణులు అన్ని రంగాల్లో రాణించాలని యాదాద్రి భువనగిరి జిల్లా ఫారెస్టు అధికారి నారాయణదాస్ రఘువీర్ ప్రతాప్ అన్నారు. సోమవారం విశ్వబ్రాహ్మణ సేవా సంస్థ అధ్యక్షుడు దాసోజు శ్రీనివాస్ లయన్స్ క్లబ్ నల్లగొండ గోల్డ్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయనను సన్మానించి మాట్లాడారు. ప్రొఫెసర్ డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య, లింగమూర్తి, దాసోజు లలిత, కృష్ణమాచారి, పెండోట సోము, చొల్లేటి లక్ష్మణ్, నరేంద్రబాబు, బ్రహ్మచారి, రవి, వెంకటాచారి, భీష్మాచారి, హైమావతి, ఉమాదేవి పాల్గొన్నారు.

# పంచాయతీ భవనాలకు మోక్షమెప్పుడు ?

- కొన్ని గ్రామాల్లో నిర్మాణ దశలోనే నిలిచిపోయిన పనులు
- మరికొన్ని చోట్ల స్థలాల కొరత
- ఇబ్బందులు పడుతున్న సిబ్బంది, ప్రజలు

**తిప్పర్తి :** గ్రామాల్లో పాలన సులభతరం చేయడానికి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఆవాస గ్రామాలను గ్రామ పంచాయతీలుగా మార్చారు. కానీ నూతన గ్రామ పంచాయతీల్లో అందుకు తగ్గ వసతులు ఏర్పాటు చేయలేదు. గ్రామాల్లో పాలనకు కేంద్రమైన పంచాయతీ భవనాలను పూర్తి స్థాయిలో నిర్మించలేదు. తిప్పర్తి మండలంలో గతంలో 21 గ్రామ పంచాయతీలు ఉండేవి. నూతన మండలాలు ఏర్పాటు కావడంతో కొన్ని గ్రామాలను ఆయా మండలాల్లో కలిపారు. పాత గ్రామాలు పోను తిప్పర్తి మండలంలో 10 గ్రామ పంచాయతీలు మిగిలాయి. అనంతరం గత ప్రభుత్వం నూతన గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేయడంతో తిప్పర్తి మండలంలో గ్రామ పంచాయతీల సంఖ్య 26కు చేరుకుంది.

**ఉపాధి హామీ నిధులు రూ.20 లక్షలు..**

ప్రతి గ్రామ పంచాయతీలో నూతన భవనాలు ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నూతన గ్రామ పంచాయతీలతోపాటు పాత గ్రామపంచాయతీల్లో శిథిలావస్థలో ఉన్న భవనాల స్థానంలో నూతన భవనాలు మంజూరు చేసింది. ఉపాధి హామీ పథకం ద్వారా ఒక్కో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేసింది. ఆ నిధులతో తిప్పర్తి మండలంలో గంగన్నపాలెం, కాశివారిగూడెం, ఆరెగూడెం,



ఇండ్లూరులో నిలిచిపోయిన గ్రామ పంచాయతీ భవనం

సిలార్‌మియాగూడెం, జొన్నగడ్డలగూడెం, రాయినిగూడెం, గడ్డికొండారం, సర్వారం, మర్రిగూడెం గ్రామాల్లో నూతన గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రారంభించారు. జంగారెడ్డిగూడెం, కంకణాలపల్లి గ్రామాల్లో భవనాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇండ్లూర్‌లో పిల్లర్లు, బేస్‌మెంట్ వరకు నిర్మించి వదిలేశారు. మామిడాల గ్రామంలో గ్రామ పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణం కోసం 2024 జనవరిలో శంకుస్థాపన చేశారు. కానీ నేటికీ పనులు మాత్రం ప్రారంభం కాలేదు.

**స్థలాలు లేకపోవడంతో..**

తిప్పర్తి మండలంలోని అంతయ్యగూడెం, రామలింగాలగూడెం, సోమోరిగూడెం గ్రామాల్లో గ్రామపంచాయతీ భవనాల నిర్మాణానికి స్థలం లేక పోవడంతో పనులు ప్రారంభం కాలేదు. అదేవిధంగా స్థలం ఉన్నప్పటికీ దుప్పలపల్లి, యాపలగూడెం, వెంకటాద్రిపాలెం, గోదోరిగూడెం, తిప్పర్తి గ్రామాల్లో



మామిడాలలో శిథిలావస్థలో ఉన్న గ్రామ పంచాయతీ కార్యాలయం

గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణ పనులు ఇప్పటికి ప్రారంభం కాలేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని తిప్పర్తి మండలంలో నిలిచిపోయిన గ్రామపంచాయతీ నిర్మాణ పనులు పూర్తి చేయాలని మండలంలోని ప్రజలు కోరుతున్నారు.

**త్వరలో పూర్తి చేస్తాం**



జంగారెడ్డిగూడెం, కంకణాలపల్లిలో గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఇండ్లూరులో బెస్‌మెంట్ లెవల్ వరకు పిల్లర్లు వేశారు. కొన్ని గ్రామాల్లో స్థలం లేక భవన నిర్మాణాలు ఆగాయి. మిగిలిన పంచాయతీల్లో కూడా నిర్మాణ పనులు ప్రారంభించి త్వరలో పూర్తి చేసేలా చూస్తాం.

–పి.శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఏఈ, తిప్పర్తి

# క్షయ రహిత సమాజానికి కృషి చేయాలి

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

**నకిరేకల్ :** క్షయ రహిత సమాజం కోసం కృషి చేయాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కోరారు. క్షయ విభాగం ఆధ్వర్యంలో నకిరేకల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం క్షయ బాధితులకు న్యూట్రిషన్ కిట్స్‌ను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. క్షయ వ్యాధి నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. క్షయ నివారణ యూనిట్ అధికారి యాసారపు రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, మార్కెట్, మున్సిపల్ చైర్ పర్సన్లు గుత్తా మంజుల, చౌగోని రజిత, పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు, ఆయా మండలాల పీహెచ్‌సీ డాక్టర్లు యోగస్వీ, అర్చన, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

**సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ**

నకిరేకల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం నకిరేకల్ మండలానికి సంబంధించిన 93 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం ఎమ్మెల్యే వేముల వీరేశం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నకిరేకంటి ఏసుపాదం, లింగాల వెంకన్న, పన్నాల రాఘవరెడ్డి, గాదగోని కొండయ్య, నకిరేకంటి నరేందర్, పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



న్యూట్రిషన్ కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

# కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత

- మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్

**శాలిగౌరారం:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. శాలిగౌరారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం బీఆర్‌ఎస్ పార్టీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనలో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని గగ్గోలు పెట్టడం వారి అజ్ఞానానికి నిదర్శనమన్నారు. బీజేపీ మాట వినకపోతే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జైలుకెళ్లక తప్పదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఓటుకు నోటు కేసులో ప్రస్తుతం బెయిల్‌పైనే బయట ఉన్నాడన్నారు. బీజేపీని వ్యతిరేకిస్తే ఆ కేసులో జైలుకు వెళ్లక తప్పదన్నారు. జలాల దోపిడీకి పాల్పడితే మరో ఉద్యమాన్ని చేపట్టేందుకు బీఆర్‌ఎస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అయితగోని వెంకన్న, యూత్ అధ్యక్షుడు కల్లూరి నాగరాజు, చాడ హతీష్‌రెడ్డి, కట్ట వెంకట్‌రెడ్డి, మామిడి సర్వయ్య, గుండా శ్రీనివాసులు, గుజిలాల్ శేఖర్‌బాబు, జేరిపోతుల చంద్రమౌళి, దుబ్బ వెంకన్న, సైదులు, శ్రీరాములు, యాదయ్య, నర్సిరెడ్డి, కొమరయ్య, తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ ఎదుట కౌలు రైతుల నిరసన

**నల్లగొండ:** నాంపల్లి మండలం తిరుమలగిరి గ్రామంలో 254 ఎకరాల భూమి రామస్వామి అనే వ్యక్తి పేరున ఉందని, ఆ భూమిని 2006లో కొందరు దేవాదాయ శాఖ భూమిగా మార్చి తమను కౌలు చెల్లించమంటున్నారంటూ ఆ భూమి సాగు చేసుకుంటున్న రైతులు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. రామస్వామి అనే వ్యక్తి గ్రామంలో పట్వారిగా ఉండేవాడని, అతడికి వారసులు లేకపోవడంతో ఆ భూములను అప్పట్లో రైతులకు కౌలుకు ఇచ్చాడని తెలిపారు. దాదాపు 100 కుటుంబాల వరకు ఆ భూమలను సాగుచేస్తూ జీవనం సాగిస్తున్నామని పేర్కొన్నారు. 1997లో కొందరు రామస్వామి భూమిని రామస్వామి దేవాలయ భూమిగా మార్చి దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకుపోయారని తెలిపారు. 2006 నంచి భూమిపై పోరాటం చేస్తున్నామని ఈ విషయంలో అధికారులు విచారించి తమకు న్యాయం చేయాలని కోరారు. యాదమ్మ, అనసూయ, సువర్ణ, శ్రీనివాస్‌తోపాటు 50 మందికిపైగా కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.



నిరసన తెలుపుతున్న కౌలుదారులు

# గ్రీవెన్స్ డేలో అదనపు కలెక్టర్‌కు వినతులు



నల్లగొండ : అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బైపాస్ రోడ్డు బాధితులు

**నల్లగొండ:** ఎస్సీ వర్గీకరణ, రోస్టర్ పాయింట్ల కేటాయింపుల్లో మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, రోస్టర్ విధానాన్ని సవరించాలని కోరుతూ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు లకుమాల మధుబాబు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌కుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి జంగాల భిక్షం, పాలపాటి సుమలత, రాయల మౌనిక, బూరుగు శ్రీలత, జంగాల శ్రీనివాస్, సల్వాది ప్రభాకర్, సల్వాది రజినీకాంత్, తిరగమల్ల రమేష్, బూరుగు అంజయ్య, గంటల భిక్షం, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, వెంకటయ్య, భిక్షం, అంజయ్య పాల్గొన్నారు.

**బైపాస్ బాధితుల వినతి**

నల్లగొండ పట్టణం చుట్టూ నిర్మించనున్న బైపాస్ రోడ్డులో భూములు కోల్పోతున్న వారికి చెల్లించే నష్టపరిహారం విషయంలో సవరణలు చేయాలంటూ బైపాస్ రోడ్డు బాధితులు సోమవారం గ్రీవెన్స్‌లో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఒకటే గ్రామం ఒకటే సర్వే నంబర్ అయినా ఒకరికి గుంటకు రూ.6,66,513 చెల్లించగా మరొకరికి రూ. లక్షా 8 వేలు ధర నిర్ణయించి నోటీసులు పంపడం సమంజం కాదన్నారు. కార్యక్రమంలో పాలకూరి శ్రీహరి, దండంపల్లి సత్తయ్య, దండంపల్లి నర్సింహ, దేవేందర్, పనస అండాలు, పజ్జూరు సైదులు తదితరులు పాల్గొన్నారు.

**నాన్ టీచింగ్ స్టాఫ్‌కు వేతనాలు ఇవ్వాలి**

జిల్లాలోని 17 మోడల్ స్కూళ్లలో పనిచేసే నాన్ టీచింగ్ స్టాఫ్‌కు ఐదు నెలలుగా వేతనాలు విడుదల చేయాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు గ్రీవెన్స్‌లో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఒక్కో మోడల్ స్కూల్‌లో ఒక కంప్యూటర్ ఆపరేటర్, అటెండర్, వాచ్‌మెన్, ఫిజికల్ డైరెక్టర్ మొత్తం నలుగురు ఉంటారని, 17 స్కూళ్లలో 68 మందిని పని చేస్తున్నట్లు తెలిపారు.

**కంపెనీల ఏర్పాటుకు అనుమతి నిలిపివేయాలని..**

**నార్కట్‌పల్లి:** అక్రమంగా అనుమతులు తీసుకుని మనుషులు, పశువుల ఆరోగ్యానికి హాని కలిగించే కంపెనీల ఏర్పాటును నిలిపివేయాలని కోరుతూ సోమవారం గ్రీవెన్స్‌లో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌కు ఎల్లారెడ్డిగూడెం, చెర్వుగట్టు గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

### పేద విద్యార్థినికి ఎమ్మెల్యే వీరేశం చేయూత

**చిట్యాల:** నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థిని కష్టపడి చదివి ఇంటర్‌లో మంచి మార్కులు సాధించింది. కానీ తాను అనుకున్న మెడికల్ సీటు సాధించలేకపోయింది. ఆ విద్యార్థిని కల నెరవెర్చేందుకు ముందుకు వచ్చారు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం. వివరాలు.. చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామానికి చెందిన మస్సు నందిని మూడో తరగతిలో ఉండగానే ఆమె తల్లి మృతి చెందింది. తండ్రి మద్యానికి బానిసగా మారి తన కూతురును పట్టించుకోకుండా ఉండిపోయాడు. ఆ విద్యార్థిని తన మామయ్య సత్యనారాయణ, ఇతర కుటుంబసభ్యులు, పెద్దమ్మ సహకారంతో ఇంటర్ బైపీసీ ని జనంపల్లి గ్రామంలోని రెసిడెన్షియల్ కాలేజీలో చదివి రాష్ట్ర స్థాయిలో 989 మార్కులు సాధించింది. కానీ నీట్ ఎంట్రన్స్‌లో మంచి ర్యాంకు సాధించలేకపోయింది. మెడిసిన్ ఎంట్రన్స్‌లో మంచి ర్యాంకు సాధించేందుకు కోచింగ్ సెంటర్‌లో చేరేందుకు గాను తగిన ఆర్థిక స్థోమత లేకుండా పోయింది. విషయం తెలుసుకున్న ఆ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు అవుల సుందర్.. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంకు విద్యార్థిని పరిస్థితి వివరించారు. దీంతో ఆ విద్యార్థిని హైదరాబాద్‌లో మెడిసిన్ కోచింగ్ సెంటర్‌లో చేర్పించేందుకు అవసరమైన లక్షా ఎనభై వేల రూపాయల ఆర్థిక చేయూత అందించేందుకు ఎమ్మెల్యే ముందుకు వచ్చారు. విద్యార్థిని నందిని సోమవారం హైదరాబాద్‌లోని కోచింగ్ సెంటర్‌లో చేరింది.

### ఫిర్యాదులపై విచారణ

**నల్లగొండ :** మర్రిగూడ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపాల్ నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నారని పలువురు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మోడల్ స్కూల్ స్టేట్ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఆదేశాల మేరకు సోమవారం డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్ పాఠశాలలో విచారణ చేపట్టారు. పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం మోడల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనం,పరిశీలించారు. ఆయన వెంట ఏఎస్ఓ సుధాకర్ ఉన్నారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



రోడ్డుపై నిలిచిన నీటిని పరిశీలిస్తున్న అధికారులు

**చిట్యాల:** వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా జ్వరాల బారిన పడకుండా ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ప్రదీప్ సూచించారు. చిట్యాల మండలం వనిపాకల గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి తీవ్ర జ్వరం రావడంతో నాలుగు రోజుల క్రితం చిట్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలకు వెళ్లాడు. అతడిని పరీక్షించిన వైద్యులు డెంగ్యూ సోకినట్లు గుర్తించారు. వెంటనే ఆ యువకుడిని మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం నల్లగొండలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సోమవారం వనిపాకల గ్రామంలో చిట్యాల ప్రభుత్వ ఆస్పత్రి సీహెచ్‌ఓ నర్సింగరావు డెంగ్యూ కేసు మోదైన ఇంటిని జిల్లా మలేరియా అధికారితో కలిసి పరిశీలించారు. ఈ ఇంటి చుట్టుపక్కల యాభై మందికి జ్వర సర్వే, వైద్య పరీక్షలు చేశారు. ఆ వీధిలో పెరిత్రం స్ప్రే చేయించారు. వీధులు, ఇళ్లు, టైర్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని గ్రామస్తులకు వైద్య సిబ్బంది సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, ఏఎన్ఎంలు స్వప్న, పుష్ప పాల్గొన్నారు.

# రామాలయంలో తిరు నక్షత్ర వేడుకలు

**నల్లగొండ :** నల్లగొండ పట్టణంలోని రామగిరి రామాలయంలో తిరు నక్షత్ర వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పుబ్బ నక్షత్రం గోదాదేవి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు అమ్మవారికి అభిషేకం, నీరాటోత్సవం జరిపించారు. సాయంత్రం ఊంజల్ సేవ చేశారు. ఆలయ అర్చకులు రామరంగాచార్యులు, యాదగిరాచార్యులు, శఠగోపాచార్యులు, రఘునందనాచార్యులు, రంగయ్య, భగవాన్‌స్వామి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

### నేడు మంత్రుల రాక



సభా స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

**కట్టంగూర్ :** మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో లబ్ధిదారులకు నూతన రేషన్‌కార్డులు పంపిణీ చేసేందుకు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ వస్తున్నట్లు నల్లగొండ ఆర్‌డీఓ యారాల అశోక్‌రెడ్డి తెలిపారు. కట్టంగూర్‌లో నిర్వహించే సభా స్థలాన్ని సోమవారం ఆయన డీఎస్పీ శివరాంరెడ్డితో కలిసి పరిశీలించి మాట్లాడారు. అనంతరం అయిటిపాముల జోనా బీఈడీ కాలేజీలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ సెంటర్‌ను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ జ్ఞానప్రకాశ్‌రావు, డీటీ ఆల్‌బర్ట్ ఫ్రాంక్లిన్, ఆర్‌ఐ కుమార్‌రెడ్డి, సివిల్ సప్లయ్ డీటీ రాచకొండ జ్యోతి, సీఐ కొండల్‌రెడ్డి, ఎస్ఐ మునుగోటి రవీందర్ ఉన్నారు.

### ఆసరా పింఛన్లను పెంచాలి

**చిట్యాల:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఆసరా, చేయూత ఫించన్‌లను పెంచాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎరసాని గోపాల్‌మాదిగ డిమాండ్ చేశారు. చిట్యాలలో సోమవారం జరిగిన వీహెచ్‌పీఎస్(వికలాంగుల హక్కుల పోరాట సమితి) సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

### పీఎఫ్‌పై అవగాహన

**నల్లగొండ టూటౌన్:** మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులకు పీఎఫ్‌పై అవగాహన ఉండాలని ఈపీఎఫ్ నోడల్ అధికారి కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈపీఎఫ్‌పై సోమవారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శానిటరీ కార్మికులకు అవగాహన కల్పించారు. మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు జి.శ్రీనివాస్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు.

### 'విద్యార్థులకు సైకిళ్లు ఇప్పిస్తా'

సాక్షి ఎఫెక్ట్

**మునుగోడు:** మునుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వచ్చి విద్యనభ్యసిస్తున్న చొల్లేడు గ్రామ విద్యార్థులకు తన సొంత డబ్బులతో సైకిళ్లు ఇప్పిస్తానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి హామీ ఇచ్చారు. చొల్లేడు గ్రామానికి చెందిన విద్యార్థులు పాఠశాలకు వెళ్లే సమయానికి బస్సులు రాకపోవడంతో సోమవారం సాక్షి దినపత్రికలో ‘సమయానికి బస్సులు లేక విద్యార్థుల తంటాలు’ అనే కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎమ్మెల్యే ఆ విద్యార్థులకు సైకిళ్లు ఇప్పిస్తానని సాక్షికి తెలిపారు.

### గీత కార్మికుడికి గాయాలు

**చిట్యాల:** ప్రమాదవశాత్తు కల్లు గీత కార్మికుడు తాటి చెట్టుపై నుంచి జారి పడి తీవ్రంగా గాయపడిన సంఘటన చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు.. గుండ్రాంపల్లి గ్రామానికి చెందిన అనంతుల మల్లేశం గౌడ్ గ్రామ శివారులో కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు జారి పడ్డాడు. దీంతో అతడి కాలి తుంటి ఎముక విరిగింది. స్థానికులు గమనించి అతడిని వైద్య చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లి శివారులోని కామినేని ఆస్పత్రికి తరలించారు. మల్లేశంగౌడ్‌ను ప్రభుత్వం ఆదుకోవాలని ఆ గ్రామ కల్లు గీత కార్మిక సంఘం అధ్యక్షుడు బొడిగె అంజయ్య గౌడ్ కోరారు.

### రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

**నల్లగొండ :** రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య అన్నారు. సోమవారం నల్లగొండ మండలం గుండ్లపల్లి గ్రామంలో ఎస్‌ఎల్‌బీసీ కాలువ నుంచి డి–37 కాల్వకు వారు నీటిని విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ అధికారులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జూలకంటి వెంకట్‌రెడ్డి, గుండ్లపల్లి మాజీ సర్పంచ్ పనస శంకర్, సత్యనారాయణ, వడ్లాల జానయ్య పాల్గొన్నారు.

### కబడ్డీ పోటీల్లో రన్నరప్‌గా శ్రీ విద్యాపీఠ్ విద్యార్థులు

**నార్కట్‌పల్లి:** కరీంనగర్ జిల్లాలో ఈ నెల 25 నుంచి 27 వరకు నిర్వహించిన ఉమ్మడి రాష్ట్ర (ఆంధ్రప్రదేశ్ –తెలంగాణ) సీబీఎస్ఈ క్లస్టర్–7 బాలుర కబడ్డీ అండర్–17 విభాగం పోటీల్లో నార్కట్‌పల్లి శ్రీ విద్యాపీఠ్ పాఠశాల విద్యార్థులు రన్నరప్‌గా నిలిచి సిల్వర్ మెడల్ సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బిట్ర సుస్మిత సోమవారం తెలిపారు. అండర్–14 కబడ్డీ పోటీల్లో కూడా ఈ పాఠశాల విద్యార్థులు 3వ స్థానంలో నిలిచి రజత పతకం పొందారన్నారు. అండర్ 17 విభాగంలో పదో తరగతి విద్యార్థి కన్నెబోయిన శ్రీజన్ బెస్టు డిఫెండర్ అవార్డు గెలుచుకోవడం విశేషం. విద్యార్థులను ప్రిన్సిపాల్ సుస్మిత, కోచ్ జగదీశ్వర్‌రావు, కామినేని యజమాన్యం అభినందించారు.

# కార్మికులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలి

**నల్లగొండ టౌన్:** రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన నిర్వహణ బిల్లులు, గుడ్ల బిల్లులను కార్మికులకు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పోలె సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మధ్యాహ్న భోజన పథకం కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంలో కార్మికులు 10 నెలలుగా ఎదురు పెట్టుబడి పెట్టి బిల్లులు రాక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు అల్లి అనురాధ, సోముల వసంత, కొప్పు అండాలు, వంటెపాక సైదమ్మ, శారద, తండ పుష్పలత, సరోజ, లక్ష్మమ్మ, ఎల్లయ్య, లలిత, రేవతి, నాగమ్మ, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

### ఆలయ అర్చకుడికి అవార్డు



అవార్డు అందుకుంటున్న నరసింహాచార్యులు

**నార్కట్‌పల్లి:** మండలంలోని మాండ్ర గ్రామ ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకుడిగా పనిచేస్తున్న ఉత్తరపల్లి నరసింహాచార్యులుకు గ్లోబల్ ఎక్సలెంట్ స్టార్ ఇంటర్నేషనల్ అవార్డు లభించింది. ఆయన రాసిన సాహిత్య వ్యాసాలను గుర్తించి అవార్డును అందజేశారు. ఆదివారం రాత్రి బెంగళూరులో అంతర్జాతీయ తెలుగు సంస్కృతి సాహితీ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వాస్తు జ్యోతిష్యులు మోహన్‌రావు శర్మ నుంచి ఉత్తరపల్లి నరసింహాచార్యులు అవార్డు అందుకున్నారు.

### సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

**కేతేపల్లి:** పత్తి పంటలో రైతులు సకాలంలో సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టి తెగుళ్ల బారిన పడకుండా పంటను కాపాడుకోవాలని ఏఓ బి.పురుషోత్తం సూచించారు. కేతేపల్లి మండలంలోని కొండకింది గూడెం గ్రామంలో రైతులు సాగు చేసిన పత్తి పంటలను సోమవారం ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం కేతేపలిల్లోని పీఏసీఎస్ కేంద్రంలో యూరియా, ఎరువుల నిల్వలను, విక్రయాలను పరిశీలించారు. మండలంలోని రైతులకు అవసరమైన యూరియా, ఇతర ఎరువులు పీఏసీఎస్, ఏఆర్‌ఎస్‌కే, ఎన్‌డీసీఎంఎస్ కేంద్రాలు, ప్రైవేటు ఎరువుల షాపుల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఏఓ వెంట ఏఈఓ నాగరాజు, రైతులు మోషయ్య, శ్రీను, రేణుక తదితరులు ఉన్నారు.

### బాక్సింగ్‌లో బంగారు పతకం



నిపున్‌ను అభినందిస్తున్న అదనపు ఎస్పీ రమేష్

**నార్కట్‌పల్లి:** చెర్వుగట్టులో నిర్వహిస్తున్న నకిరేకల్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల 9వ తరగతి విద్యార్థి చింతమల్ల నిపున్ హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ బాక్సింగ్ చాంపియన్ షిప్–2025 పోటీల్లో 67–70 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించినట్లు జిల్లా యువజన క్రీడల అధికారి మహ్మద్ అక్బర్ అలీ సోమవారం తెలిపారు. నిపున్ ఆగస్టు 7 నుంచి 13 వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని గ్రేట్ నోయిడాలో జరిగే జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు అర్హత సాధించినట్లు పేర్కొన్నారు. కోచ్ శ్రీకాంత్, పీడీ కొంగరి వెంకటేశ్వర్లు పీఈటీ కె. మహేష్‌లు నిపున్‌కు శిక్షణ నిచ్చారు. ఈ సందర్భంగా నిపున్‌ను నల్లగొండ అదనపు ఎస్పీ ఎస్. రమేష్, పాఠశాల ప్రిన్సిపాల్ బాలోజీ అభినందించారు.

### ఫుడ్ సేఫ్టీ అధికారికి పీహెచ్‌డీ

**నల్లగొండ:** జిల్లాలోని గుడిపల్లికి చెందిన నిమ్మల శివశంకర్‌రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి సోమవారం పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. బయోకెమిస్ట్రీ విభాగంలో డా.రాజు పాడియా పర్యవేక్షణలో 'స్ట్రెప్టోజోటోసిన్ ప్రేరిత మధుమేహ ఎలుక మోడల్స్‌ను ఉపయోగించి ఇన్–విట్రో అండ్ ఇన్–వైవో అధ్యయనాల్లో ఇన్సులిన్ నిరోధాన్ని తగ్గించేందుకు ఔషధ లక్ష్యాలుగా పనికివచ్చే వృక్ష ఆధారిత సమ్మేళనాల స్క్రీనింగ్, గుర్తింపు లక్షణ నిర్ధారణ' అంశంపై చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ పట్టా లభించినట్లు శివశంకర్‌రెడ్డి తెలిపారు. శివశంకర్‌రెడ్డి ప్రస్తుతం నల్లగొండ ఫుడ్ సేఫ్టీ అధికారిగా పనిచేస్తున్నారు.



పీహెచ్‌డీ అందుకుంటున్న శివశంకర్‌రెడ్డి